పేదలకు సన్నబియ్యం అందిస్తాం


కృష్ణాలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలం, అధికారులు


మాగనూర్‌లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తున్న డీఎస్ఓ బాలరాజు, అధికారులు

- అదనపు కలెక్టర్ బెన్‌షాలం
- కృష్ణాలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభం

కృష్ణా: ప్రభుత్వం రేషన్ కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు సన్నబియ్యం ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ముడుమాల్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పేదల పాలిట వరం: డీఎస్ఓ బాలరాజు

మాగనూర్: సన్నబియ్యం పేదల పాలిట వరమని డీఎస్ఓ బాలరాజు అన్నారు. మండల కేంద్రంలోని 1వ రేషన్ దుకాణంలో మండల అధికారులు, వివిధ పార్టీల నాయకులతో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని డీఎస్ఓ ప్రారంభించారు. ప్రతి ఒక్క రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్, సివిల్ సప్లై డీటీ గురురాజారావు, ఆర్ఐ శ్రీశైలం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, దండు ఆనంద్, నాయకులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి: ఆర్డీఓ రాంచందర్ నాయక్

కోస్గి: పేదల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఆర్డీఓ రాంచందర్ నాయక్ అన్నారు. కోస్గి మున్సిపల్ కేంద్రంలో ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. పట్టణంలోని 7వ నంబర్ రేషన్ దుకాణంలో స్థానిక అధికారులు, నాయకులు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. గుండుమాల్ మండల కేంద్రంలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పీఏసీఎస్ అధ్యక్షుడు భీంరెడ్డి, నాయకులు నరేందర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆరు కిలోలు..

ఊట్కూరు: మండల కేంద్రంలోని 25వ రేషన్ దుకాణంలో తహసీల్దార్ చింతరవి సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు కిలోల సన్నబియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీలర్ రాఘవేంద్రనాయుడు, కాంగ్రెస్ నాయకులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.


కోస్గిలో బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న ఆర్డీఓ రాంచందర్‌నాయక్, తదితరులు

సన్నబియ్యం సద్వినియోగం చేసుకోవాలి

మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ డీఎం సైదులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు సూచించారు. మద్దూరులోని రేషన్ షాపు నెం–2, ఖాజీపూర్‌లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కోస్గి ఏఎంసీ చైర్మన్ భీములు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్‌గౌడ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్, ఎంపీడీఓ నర్సింహారెడ్డి, ఎంపీఓ రామన్న, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోండి

మాగనూర్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మాగనూర్ ఎంపీడీఓ రహ్మతుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువత, ఇతరులు ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. దరఖాస్తులకు చివరి తేదీ ఈ నెల 14 వరకు ఉందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మ్యానువల్‌గా ఫామ్ ఫిల్ చేసి ఎంపీడీఓ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు.

కోస్గిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

కోస్గి: గత ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజన సందర్భంగా కోస్గిని రెవెన్యూ డివిజన్‌గా చేస్తామని ప్రకటించిందని, ప్రస్తుతం సీఎం సొంత నియోజకవర్గం కావడంతో వెంటనే కోస్గిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బీజేపీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు రమేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లేకపోవడంతో ఇక్కడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలన్నారు.

యాదవ హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడిగా హన్మంతు



కోస్గి: యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా హన్మాన్‌పల్లికి చెందిన గుర్రం హన్మంతును నియమించారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఏబీకే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు రాములు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో యాదవ కులస్థులందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. ఇదే క్రమంలో సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ముక్తిపాడ్‌కు చెందిన నర్సింహులును నియమించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిజాయితీని చాటుకున్న యువకుడు



నర్వ: రహదారిపై డబ్బులతో కూడిన పర్సు కనిపించగానే వెంటనే పోలీసులకు అందించి నిజాయితీని చాటుకున్నాడు ఓ యువకుడు. మండలంలోని లంకాల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ మాజీ అధ్యక్షులు డీకే జనార్దన్ లంకాల్ నుంచి పని నిమిత్తం నర్వకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో దారిలో పర్సు కనిపించగా తీసి చూడగా ఉందులో డబ్బులు, ఏటీఎం, పాన్‌కార్డు కనిపించడంతో వెంటనే నర్వ పోలీస్‌స్టేషన్ వెళ్లి హెడ్‌కానిస్టేబుల్ ఆంజనేయులుకు అప్పగించారు. పర్సులో లభించిన వివరాల మేరకు లంకాల గ్రామానికి చెందిన సాయికుమార్‌దిగా గుర్తించారు. అతనిని పిలిపించి పర్సులోని రూ.10 వేలు, ఏటీఎం, పాన్‌కార్డు అందించారు. ఈ సందర్భంగా నిజాయితీగా డబ్బులు, కార్డులను అందించిన డీకే జనార్దన్‌ను గ్రామస్తులు విజయ్‌కుమార్, మహేందర్, నర్సింహ, పోలీస్ సిబ్బంది అభినందించారు.

'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్'



మద్దూరు: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో తెలంగాణ, హర్యానా రాష్ట్రాల్లోని కళారూపాలు, వంటకాలు, పండుగలు, స్మారక చిహ్నాలు, క్రీడలు మొదలైన వాటిని తెలియజేసేలా ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులతో ఈ రెండు రాష్ట్రాలకు చెందిన కట్టుబొట్టు వేషధారణలు వేయించారు.

సామూహిక యజ్ఞాలు



మరికల్: మండలంలోని అప్పంపల్లి ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో బుధవారం నుంచి 499 శివరామకోటి జప, గీతాజ్ఞాన యజ్ఞాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి రోజు 12మంది జంటలతో సదానంద యోగీశ్వరులు, రఘునాథపూర్, బ్రహ్మచారులు సామూహిక యజ్ఞాలు చేయించారు.

పర్యావరణ విధ్వంసం సరికాదు

నారాయణపేట ఎడ్యుకేషన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రభుత్వం తమ హస్తగతం చేసుకోవడానికి ప్రయత్నించడం సరైన పద్ధతి కాదని, పర్యావరణ విధ్వంసం సృష్టిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక సత్యనారాయణ చౌరస్తా దగ్గర హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి వ్యతిరేకంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. విద్యార్థి సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, జిల్లా నాయకులు రాజు, కృష్ణ, మంజుల, సుజాత, కావేరి, గణేష్, మహేష్, విక్రమ్, అనూష, భానుప్రియ, నిర్మల, శిరీష, కార్తీక్ పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

హెచ్‌సీయూ భూములు అమ్మడం విరమించుకోవాలి

మరికల్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను విక్రయించే ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తిరుపతయ్య, బసంత్, శేఖర్‌లు అన్నారు. మరికల్‌లో వారు విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలను బలోపేతం చేయాల్సింది పోయి బలహీన పర్చేందుకు తీసుకుంటున్న చర్యలు అర్థరహితమన్నారు. ఈ భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పే విధానాన్ని ఖండిస్తున్నామన్నారు.

యూనివర్సిటీ భూముల వేలం ఆపాలి

దామరగిద్ద: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు గోపాల్, మండల కార్యదర్శి అంజిలయ్యగౌడ్‌లు డిమాండ్ చేశారు. యూనివర్సిటీ విద్యార్థుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 400 ఎకరాల విశ్వవిద్యాలయ భూమి వేలం పాటను వెంటనే నిలిపివేసి యూనివర్సిటీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోషి, అరుణ్, మోహన్, మహేష్‌లు పాల్గొన్నారు.


దామరగిద్దలో నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

జమిలీ ఎన్నికలపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింత రామచంద్రారెడ్డి

నారాయణపేట: దేశ ప్రజలపై పడుతున్న వేలకోట్ల భారాన్ని వివరిస్తూ, వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింత రామచంద్రారెడ్డి అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్యయాదవ్ అధ్యక్షతన బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్యమైన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో, దేవాలయాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించాలని, వాజ్‌పేయ్ శత జయంతి ఉత్సవాలలో భాగంగా ఆ మహనీయుని స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

ఇంటింటా బీజేపీ జెండా ఎగరవేయాలి

ఏప్రిల్ 6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి బూత్‌లో, ఇంటిపై బీజేపీ జెండా ఎగరవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్యయాదవ్ పిలుపునిచ్చారు. సమావేశంలో నాగురావు నామాజి, రాష్ట్ర నాయకులు రతంగ పాండు రెడ్డి, కొండయ్య, పగడాకుల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

శిశు సంక్షేమ శాఖకు అనాథ పిల్లల తరలింపు

మరికల్: మండలంలోని గాజులయ్యతండాలో తల్లి మృతితో అనాథలైనా ఇద్దరు పిల్లలను బుధవారం జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారులకు తండావాసులు అప్పగించారు. గత నెల 22న పిల్లల తల్లి లక్ష్మి అడవిలో కట్టెలకు వెళ్లి పాముకాటుకు గురై మృతి చెందింది. తండాలో గిరిజనులు రూ.37,500 చందాలు వేసి, అందుల్లో రూ.12 వేలు అంత్యక్రియలకు ఖర్చు చేశారు. మిగితా డబ్బు అనాథలైన రేణు, మహేశ్‌ల పేరు మీద డిపాజిట్ చేశారు. పిల్లల విషయం సంరక్షణ కమిటీ లీగల్ అడ్వైజర్ కవిత దృష్టికి తీసుకెళ్లగా, ఆమె అక్కడికి చేరుకొని విచారణ చేసింది. అనంతరం తండా ప్రజల సమీక్షంలో శిశు సంక్షేమ శాఖకు ఇద్దరు పిల్లలను తీసుకెళ్లారు.



ఉపాధి హామీ కూలీలకు అంబలి పంపిణీ


మిర్జాపూర్‌లో ఉపాధి కూలీలకు అంబలి పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీధర్

కోస్గి రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు అంబలి వితరణ చేపట్టామని ఎంపీడీఓ శ్రీధర్ అన్నారు. బుధవారం మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో ఉపాధి కూలీలకు అంబలి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ నర్సింహులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరి ప్రసాద్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ కస్టమర్ సేవా కేంద్రం ప్రారంభం



ఊట్కూరు: మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ వీధిలో బుధవారం ఎస్‌బీఐ కస్టమర్ సేవా కేంద్రాన్ని ఎస్‌బీఐ మేనేజర్ ప్రవీణ్ మోజెస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్‌కార్డు ఆధారంగా బ్యాంక్ లావాదేవీలు చేపట్టవచ్చని ఆయన తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆపరేటర్ మహాలక్ష్మి, మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు యజ్ఞేశ్వర్‌రెడ్డి, లింగం, యజ్ఞదత్తు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మద్దూరులో సర్వాయి పాపన్న వర్ధంతి



మద్దూరు: మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315వ వర్ధంతిని బీసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భావితరాలకు ఆయన చరిత్రను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు బస్వరాజ్, కృష్ణ, సంజయ్‌గౌడ్, సరేష్‌గౌడ్, నర్సింహులు, శ్రీనివాస్‌గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలు పడేస్తే లైసెన్స్ రద్దు చేస్తాం



మద్దూరు: కోళ్ల వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో, చెరువు గట్లపై, ఇతర నీళ్లు ఉండే చోట పడేస్తే చికెన్ షాపు లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని మద్దూరు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ చికెన్ షాపుల నిర్వాహకులకు తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని చికెన్ షాపుల నిర్వాహకులను పిలిచి షాపులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కోళ్ల వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది రామునాయక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

మాగనూర్: మండలంలోని వడ్వాట్ గ్రామానికి చెందిన నరేష్‌గౌడ్ 2008 డీఎస్సీలో ఉద్యోగం పొందగా, నియామకం చేయలేదు. తిరిగి ఇటీవల 2008 డీఎస్సీ వారికి నియామక పత్రాలు అందించడంతో మండలంలోని పుంజనూర్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా వడ్వాట్ గ్రామస్తులు నరేష్‌గౌడ్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ నర్సింహులు, జింకలి శ్రీను, గోవర్ధన్, హన్మంత్‌రెడ్డి, రవి, లక్ష్మీనారాయణ, రవి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

- 1370 మంది విద్యార్థులు హాజరు
- ముగ్గురు గైర్హాజరు


చివరి రోజు పరీక్షలు రాసి సంతోషంగా బయటకు వస్తున్న విద్యార్థులు

మక్తల్/మాగనూర్: పదో తరగతి పరీక్షలు గత నెల 15 నుంచి ఈనెల 2 వరకు మక్తల్ పట్టణంలో ప్రశాంతంగా ముగిసినట్లు పరీక్ష కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని కేరళ పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ బాలుర, జెడ్పీహెచ్ఎస్ బాలికల, బ్రిలియంట్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, అక్షర ఉన్నత పాఠశాలలో మొత్తం 1370 మంది పరీక్షలకు హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. పరీక్షల సమయంలో మక్తల్ ఎస్ఐ లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

- మాగనూర్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు కూడా ఐదు నిమిషాల ఆలస్యం నిబంధన అమలులో ఉండటంతో పరీక్ష కేంద్రానికి విద్యార్థులు గంట ముందే చేరుకున్నారు. మొత్తం 245 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, అందరు విద్యార్థులు హాజరైనట్లు సీఎస్ గోపాల్‌చారి, డీఈఓ మహేష్ తెలిపారు. పరీక్ష కేంద్రం దగ్గర ఎస్ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

గ్రూప్–1 ర్యాంకర్లను సన్మానించిన సజ్జనార్


గ్రూప్–1 ర్యాంకర్లను శాలువాతో సన్మానిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

నారాయణపేట రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలోని ఉద్యోగుల పిల్లలు ఇటీవల విడుదలైన గ్రూప్–1 ఫలితాల్లో చక్కటి ర్యాంకులు సాధించి డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీలుగా ఎంపికయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఇరువురు ఉద్యోగుల పిల్లలను హైదరాబాద్‌కు పిలిపించి అభినందించారు. డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న శ్రీనివాసులు కుమార్తె వీణ, టీఐ 3గా విధులు నిర్వహిస్తున్న వహీద్ కూతురు ఫాతిమినాఫైజ్‌లను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీలో సేవలు అందిస్తూ తమ పిల్లలను చక్కగా చదివించి ఉన్నత స్థానాలకు చేర్చుకున్న కార్మికులు ఎంతో అభినందనీయులన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్‌లో మరింత మంది రాణించాలని కోరారు. కార్యక్రమంలో డిపో అధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేవీకి ఎంపిక కావడం గర్వకారణం

దామరగిద్ద: బీసీ ముదిరాజ్ వర్గానికి చెందిన యువకులు ఇండియన్ నేవీ సైనికుడిగా ఎంపిక కావడం గర్వకారణమని మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మొగులప్ప, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుభాష్ అన్నారు. మండలంలోని కందెన్‌పల్లి గ్రామానికి చెందిన రఘువర్ధన్ నేవీకి ఎంపిక కావడం, దేశ సేవలో కొనసాగే అవకాశం రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు పరిపూర్ణం, నీలి వెంకట్రాములు, బోయిని భీము, దేవేందర్, రమేష్, లాలప్ప, చంద్రప్ప, మాజీ ఎంపీటీసీ అంజిలప్ప, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

కృష్ణా: మండలంలోని హిందుపూర్ గ్రామ శివారులోని అమ్మ కాలనీలో బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ వెంకటేష్ ఏపీఎం బస్వరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ జానయ్య, ఏఓ సుదర్శన్‌గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణగౌడ్, కాంగ్రెస్ మండల నాయకులు రాజప్పగౌడ పాల్గొన్నారు.


హిందుపూర్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించిన తహసీల్దార్ వెంకటేష్

పని ప్రదేశంలో షాడోనెట్ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

కొత్తపల్లి: 'ఉపాధి హామీ కూలీలకు నీడ కరువు' అనే శీర్షికతో బుధవారం ప్రచురితమైన 'సాక్షి' కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మండలంలో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్న ప్రదేశాల్లో ఎంపీడీఓ కృష్ణారావు సంబంధిత శాఖ అధికారులతో షాడో నెట్‌లను ఏర్పాటు చేశారు. పని ప్రదేశంలో కూలీలకు ఎండ తగలకుండా సౌకర్యం కల్పించారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలు పని చేసే ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు తాగు నీరు, ప్రాథమిక చికిత్స కిట్లు, కూలీలు వడ దెబ్బకు గురి కాకుండా ఉపాధిహామీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అవేవీ ఏర్పాటు చేయకుండా ఉపాధిహామీ పనులను మండుటెండలో కూలీలు పడుతున్న ఇబ్బందులను గమనించి కూలీల కష్టాన్ని 'సాక్షి' కథనం ద్వారా అధికారుల దృష్టికి తీసుకరాగా, ఈ మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.


గోకుల్‌నగర్‌లో ఉపాధి కూలీలకు షాడోనెట్ ఏర్పాటు చేసిన అధికారులు

రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల

నారాయణపేట రూరల్/కృష్ణా: జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 5న నిర్వహించే గ్రామ పంచాయతీ కార్మికుల రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. మండలంలోని కొల్లంపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ మాట్లాడారు. జీపీఎల్లో అన్ని రకాల పనులను కార్మికులతో చేయిస్తూ కనీస వేతన చట్టం అమలు చేయడం లేదని విమర్శించారు. జిల్లాలోని కార్మికులందరూ శనివారం మెట్రో గార్డెన్‌లో 2వ రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. రఘు, పాష, బీంశప్ప, అశోక్, హనుమంతు, లక్ష్మి పాల్గొన్నారు.

- కృష్ణా మండలంలోని గుడెబల్లూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రెండో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు ఏజీ బుట్టో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర మహాసభలకు పంచాయతీ కార్మికులు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లప్ప, ఉసేనప్ప, వెంకటేష్, సాబెమ్మ, మహాదేవమ్మ, పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.


కొల్లంపల్లిలో వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న పంచాయతీ కార్మికులు

మొక్కలకు పుట్టిన రోజు వేడుక

కోస్గి: మండలంలోని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు మొక్కలకు పుట్టిన రోజు వేడుక నిర్వహించారు. గతేడాది పాఠశాలలో యంగ్ ఎర్త్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు 40 మొక్కలు నాటి వాటిని సంరక్షించారు. ఈ క్రమంలో గతేడాది నాటిన మొక్కలకు పుట్టిన రోజు వేడుక నిర్వహించారు. ఈ వేడుకకు ఎంగ్ యర్త్ లీడర్స్ సమన్వయకర్త మల్లేశం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో కీలకపాత్ర వహించే మొక్కలను విద్యార్థులు నాటి సంరక్షించడం ఎంతో ఆదర్శనీయమన్నారు. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేఖరయ్య. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


మొక్కల పుట్టిన రోజు వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం

సేవా కార్యక్రమాలతో పుణ్యఫలం

కోస్గి: ప్రజలకు చేతనైన సేవ చేయడం ద్వారా సమాజంలో గుర్తింపుతో పాటు పుణ్యఫలం దక్కుతుందని సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు అన్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు కొనియడారు.

దేవాలయం దగ్గర అన్నదానం

మక్తల్: పట్టణంలో వీరభద్ర దేవాలయం దగ్గర బుధవారం ఉదయం 5 గంటలకు అగ్నిగుండం నిర్వహించి భక్తులు నిప్పుల్లో నడిచారు. సాయంత్రం రథోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్ ఈసరి నాగప్ప, కౌసల్య దంపతులు ప్రారంభించారు.